9

సాక్షి అనకాపల్లి

ఆదివారం । 31 । డిసెంబర్ । 2023

సాధికారతకు సెల్యూట్

ఓ పక్క కుట్రపూరిత రాజకీయాలు.. మరోపక్క పచ్చ పత్రికల విషపు రాతలు.. ఇంకోవైపు కొన్ని ఏడుపుగొట్టు టీవీ చానళ్లు కళ్లుగట్టినట్టు వినిపిస్తున్న పక్షపాత వార్తలు...ఇవేవీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ప్రజలకు ఉన్న అభిమానాన్ని ఇసుమంతైనా తగ్గించలేకపోయా యి...గుండెల నిండా సమరోత్సాహాన్ని నింపుకొని... కంఠాలను జై గంటలుగా మోగిస్తూ...అబిడ్ సెంటర్‌కు కవాతు చేసింది ప్రజా సైన్యం... సంక్షేమ సారథికి సెల్యూట్ చేస్తూ జై జగన్ అని నినదించింది వారి అభిమానం... వెరసి నర్సీపట్నంలో జనసంద్రం పోటెత్తింది.



నర్సీపట్నంలో జరిగిన సామాజిక సాధికార యాత్ర సభలో పాల్గొన్న అశేష జనవాహిని (డ్రోన్ చిత్రం) (ఇన్‌సెట్) సభా ప్రాంగణంలో వైఎస్సార్‌కు నివాళి



మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

- నర్సీపట్నంలో విజయవంతమైన సాధికార బస్సుయాత్ర
- జన సంద్రమైన అబిడ్‌సెంటర్
- ఆలోచింపజేసిన ఎమ్మెల్యేలు, మంత్రుల ప్రసంగాలు
- మళ్లీ జగనే సీఎం అంటూ హోరెత్తిన నినాదాలు

నర్సీపట్నం: స్థానిక అబిడ్‌సెంటర్ జనసంద్రాన్ని తలపించింది. వైఎస్సార్‌సీపీ నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్ర బహిరంగ సభకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. నాలుగున్నరేళ్లగా తమ అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పడుతున్న తపనకు కృతజ్ఞత చాటుకునేందుకు అధిక సంఖ్యలో జనం తరలిరావడంతో పట్టణం కిక్కిరిసిపోయింది.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో తమ ఆత్మగౌరవం ఇనుమడించిందని పేర్కొంటూ బడుగు బలహీన వర్గాల ప్రజలు నర్సీపట్నం నియోజకవర్గంలో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేశారు.

కదిలివచ్చిన మహిళా లోకం

నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బస్సు యాత్రకు నియోజకవర్గంలోని నర్సీపట్నం, నాతవరం, గొలుగొండ, మాకవరపాలెం మండలాల నుంచి అన్ని వర్గాల ప్రజలు, అభిమానులు వైఎస్సార్‌సీపీ జెండాలు చేతబూని ఆటోలు, ద్విచక్రవాహనాల్లో ఉత్సాహంగా తరలివచ్చారు. మెయిన్ రోడ్డుతో పాటు పట్టణంలో రహదారుల్లో ఇసుక వేస్తే రాలనంతగా జనం కనిపించారు. సభ ముగిసేంత వరకూ అక్కడే ఉండి, ప్రజాప్రతినిధుల ప్రసంగాలను ఆసక్తిగా విన్నారు. ప్రధానంగా పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. గిరాగిరా తిరుగుతుంది ఫ్యాన్ అంటూ చేతులు ఊపుతూ సంతోషంతో నృత్యాలు చేయడం కనిపించింది.

10 గ్రామాలు..17 కిలోమీటర్లు..

ముందుగా మాకవరపాలెం మండలం భీమబోయిన పాలెం వద్ద నిర్మిస్తున్న మెడికల్ కళాశాల పనులను వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎంపీ బి.వి.సత్యవతి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజు, స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం అక్కడే వై.వి.సుబ్బారెడ్డి, ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ బస్సు యాత్రను ప్రారంభించారు. డప్పు వాయిద్యాలతో కార్యకర్త లు, నాయకులు, బస్సుయాత్రకు బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. అడుగడుగునా ప్రజలు బ్రహ్మ రథం పట్టారు. అక్కడి నుంచి మాకవరపాలెం మండలంలో 10 గ్రామాల మీదుగా నర్సీపట్నం అబిడ్‌సెంటర్‌కు బస్సు యాత్ర చేరుకుంది. 17 కిలోమీటర్ల మేర సాగిన యాత్రకు ప్రజలు నీరాజనాలు పట్టారు.

ఆకట్టుకున్న ప్రసంగాలు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతి కోసం నాలుగున్నరేళ్లగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను డిప్యూటీ సీఎం ముత్యాల నాయుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, గొల్ల బాబూరావు, పెట్ల ఉమాశంకర్ గణేష్ గణాంకాలతో సహా వివరించారు. చంద్రబాబు, వైఎస్ జగన్ పాలనల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ఎమ్మెల్యేలు, మంత్రి వివరించినప్పుడు జనం నుంచి మంచి స్పందన లభించింది. సామాజిక సాధికారత కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించనప్పుడు ప్రజల హర్షధ్వానాలతో మద్దతు పలికారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సభకు ముందు పార్టీ సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు వంగపండు ఉషా బృందం సంక్షేమం, అభివృద్ధిపై ఆలపించిన పాటలు ప్రజలను ఆకట్టుకున్నాయి. వీరు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను కట్టిపడేశాయి. వంగపండు ఉష ఆలపించిన గీతాలు ఉర్రూతలూగించాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నవరత్నాల అమలు కమిటీ స్టేట్ వైస్ చైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు కాశీ విశ్వనాథం, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, వైస్‌చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, నగరాలు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత, ఉత్తరాంధ్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పీలా వెంకటలక్ష్మి, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ లక్ష్మీకాంత్, ఎంపీపీలు సుర్ల రాజేశ్వరి, రుత్తల సత్యనారాయణ, సాగిన లక్ష్మణ్‌మూర్తి, మణికుమారి, పార్టీ మండల అధ్యక్షులు ఏకా శివ, సుర్ల సత్యనారాయణ, లెక్కల సత్యనారాయణ, నాగేశ్వరరావు, రుత్తల శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు తదితరులు పాల్గొన్నారు.



హోరెత్తిన బైక్ ర్యాలీ



బస్సు యాత్రను ప్రారంభిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

చెణుకులు

సాక్షి, అనకాపల్లి : బహిరంగ సభలో మాట్లాడిన వక్తలు చెణుకులు విసురుతూ చమత్కారంగా మాట్లాడారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడికి చురకలు అంటించారు. వారి వ్యాఖ్యలకు జనం నుంచి విశేష స్పందన లభించింది.

నర్సీపట్నంలో ప్రభం'జనాన్ని' చూస్తే అయ్యన్నపాత్రుడికి, ఆయన బాస్ చంద్రబాబుకు ప్యాంట్లు తడుస్తాయి. ఐదేళ్లలో రూ.2,700 కోట్ల సంక్షేమాభివృద్ధి తీసుకొచ్చిన గణేష్‌ను రానున్న ఎన్నికల్లో మళ్లీ గెలిపిస్తే.. అంతకు రెట్టింపు ప్రగతి ఈ నియోజకవర్గంలో జరుగుతుంది.

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

ఈ జన సందోహాన్ని చూస్తే ఇది హైదరాబాద్ అబిడ్ సెంటరా.. నర్సీపట్నం అబిడ్ సెంటరా అన్న సందేహం వచ్చింది.

- ఈనాటి సభపై మీ ఎమ్మెల్యే పేరులోని మూడు పదాలతో ఇలా చమత్కరించవచ్చు

ఉమా... టీడీపీ కోమా
శంకర... అయ్యన్నకు మూతి వంకర
గణేష్... ఉప్పొంగిన తాండవ రిజర్వాయర్ జోష్

-ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



సభలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, పక్కన ఎమ్మెల్యే ఉమాశంకర గణేష్, డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, ఎంపీ సత్యవతి, ఎమ్మెల్సీ కళ్యాణి, ఎమ్మెల్యేలు బాబూరావు, అదీప్‌రాజు, భాగ్యలక్ష్మి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కాశీ విశ్వనాథం తదితరులు

యలమంచిలి రూరల్ ఎస్ఐ సస్పెన్షన్

- సీఐకు చార్జి మెమో

యలమంచిలి రూరల్: పోలీస్‌స్టేషన్‌లో భద్రపర్చిన గంజాయి చోరీ కావడంపై స్పందించిన ఎస్పీ మురళీకృష్ణ శనివారం యలమంచిలి రూరల్ ఎస్ఐ సన్ని బాబును సస్పెండ్ చేశారు. సీఐ గఫూర్‌కు చార్జి మెమో ఇస్తున్నట్టు ఎస్పీ చెప్పారు. పలు కేసుల్లో స్వాధీనపర్చుకున్న గంజాయిని యలమంచిలి రూరల్ పోలీస్‌స్టేషన్ స్టోర్ రూమ్‌లో భద్రపరిచారు. ఈ విషయాన్ని గుర్తించిన కొందరు యువకులు ఆరు నెలల నుంచి పోలీస్‌స్టేషన్ స్టోర్ రూమ్ కిటికీ గ్రిల్స్ తొలగించి దాదాపు 367 కేజీల గంజాయిని తస్కరించారు. తూర్పుగోదావరి జిల్లా పోలీసులకు వీరిలో ఇద్దరు యువకులు పట్టుబడ్డంతో తీగ లాకితే డొంకంతా కదిలింది. గంజాయిని కాజేసిన వారిలో 8 మందిని శుక్రవారం, ఇద్దరిని శనివారం అరెస్ట్ చేశారు. శనివారం పట్టుకున్న నక్కపల్లి మండలం దేవవరం గ్రామానికి చెందిన తివిరి వెంకటేష్ , మునగపాక ఇందిరమ్మకాలనీకి చెందిన మద్దాల గణేష్ కు కోర్టు రిమాండ్ విధించింది.

మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం

- జిల్లాలో గతేడాది కంటే 23 శాతం తగ్గిన క్రైమ్ రేట్
- పెరిగిన సైబర్ నేరాలు.. నియంత్రణకు చర్యలు
- రోడ్డు ప్రమాదాలపై స్పెషల్ డ్రైవ్



నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ. చిత్రంలో అదనపు, క్రైం ఎస్పీలు విజయభాస్కర్, సత్యనారాయణరావు

సాక్షి, అనకాపల్లి: ఈ ఏడాది హత్యలు, చోరీలు, రోడ్డు ప్రమాదాలు తగ్గాయని, మిగతా నేరాలు అదుపులో ఉన్నాయని 2023 వార్షిక నివేదికలో ఎస్పీ కె.వి.మురళీకృష్ణ పేర్కొన్నారు. తన కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు మొబైల్ ప్రచారరథం ద్వారా మహిళా చట్టాలు, పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. మాదక ద్రవ్యాల వలన జరిగే దుష్పరిణామాలు, సైబర్ క్రైం, నేరాలపై యువతకు అవగాహన కల్పించడం ద్వారా ఈ ఏడాది కేసులు 23 శాతం తగ్గుముఖం పట్టాయన్నారు. నివేదికలో పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి..

దిశ యాప్: ప్రత్యేక డ్రైవ్ ద్వారా 2,17,840 మంది మొబైల్స్‌లో దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నారు. యాప్ ద్వారా 1,920 కాల్స్ రాగా 13 కాల్స్‌పై కేసులు నమోదు చేశారు.

రికార్డు స్థాయిలో మొబైల్‌ఫోన్ల అప్పగింత: పోయిన సెల్‌ఫోన్లను పట్టుకునేందుకు ఒక పోర్టల్‌ను రూపొందించి రికార్డు స్థాయిలో రూ.2 కోట్ల 20 లక్షల విలువైన 1,238 మొబైల్‌ఫోన్లను రికవరీ చేశారు. 5 విడతల్లో వీటిని బాధితులకు అందించారు.

రహదారి భద్రత: 2022లో 2,674 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేయగా 2023లో 5,773 కేసులు నమోదయ్యాయి. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినవారిపై ఈ ఏడాది 16,152 కేసులు నమోదు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారిపై ఈ ఏడాది 1,28,467 చలానాలు నమోదు చేశారు.

తగ్గిన రోడ్డు ప్రమాదాలు: గత ఏడాది రహదారి ప్రమాదాల్లో 725 కేసులు నమోదు కాగా 339 మంది మృతి చెందారు. ఈ ఏడాది తీసుకున్న భద్రతా చర్యల వల్ల కేసుల సంఖ్య 689కు, మృతుల సంఖ్యకు 294కు తగ్గింది.

గంజాయికి ముకుతాడు: గంజాయి స్వాధీనం, అక్రమ రవాణాపై ప్రత్యేకంగా 34 చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సంయుక్తంగా 200 కేసులు నమోదు చేసి 7,890 కిలోల గంజాయి, 23 లీటర్ల హాషీష్ ఆయిల్ (గంజాయి నూనె)ను స్వాధీనపరుచుకున్నారు. ఈ కేసుల్లో ప్రమేయం ఉన్న 562 మంది అరెస్టు చేసి గంజాయి రవాణాకు పాల్పడుతున్న 100 వాహనాలు సీజ్ చేశారు.

మాదకద్రవ్య రహిత జిల్లాగా...: మాదకద్రవ్య అక్రమ రవాణాను అరికట్టేందుకు నాలుగు శాశ్వత చెక్‌పోస్టులు, 11 డైనమిక్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. 16 మండలాల్లో 63 గ్రామాలను గుర్తించి మండల, గ్రామస్థాయి యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేశారు. డీ అడిక్షన్‌కు ఎన్టీఆర్ వైద్యాలయంలో 15 పడకలను కేటాయించారు.

నాటుసారా నిర్మూలన: పోలీసులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సమన్వయంతో 1,378 కేసులు నమోదు చేసి 5,906 లీటర్లనాటును స్వాధీనపరుచుకొని 1,76,300 బెల్లం పులుపును ధ్వంసం చేశారు. 1,119 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. బెల్టు దుకాణాల నుంచి 765 లీటర్ల మద్యం, 124 లీటర్ల బీర్‌ను స్వాధీనం చేసుకొని 632 కేసులు నమోదు చేసి 653మందిని అరెస్టు చేశారు.

ఆస్తి నేరాలు: ఈ ఏడాది ఆస్తికి సంబంధించిన నేరాలు 419 నమోదు కాగా 151 నేరాలను ఛేదించారు. రూ.1,89,14,085 విలువైన ఆస్తులు చోరీకి గురి కాగా వీటిలో 35 శాతం రికవరీ చేశారు.

హత్యలు: గత ఏడాది 15 హత్యలు చోటుచేసుకోగా ఈ ఏడాది 25 హత్య కేసులు నమోదయ్యాయి. ఈ హత్యల్లో చాలావరకు వివాహేతర సంబంధాలే కారణం. 2022 లాభాపేక్ష హత్యలు రెండు నమోదు కాగా ఈ ఏడాది ఒక కేసు తగ్గినట్లు చెప్పారు.

మిగతా 10వ పేజీలో ▶

క్లుప్తంగా

డిప్యూటీ సీఎం న్యూ ఇయర్ వేడుకలకు దూరం

దేవరాపల్లి: ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉంటున్నట్లు తారువలోని ఆయన క్యాంప్ కార్యాలయం నుంచి శనివారం ప్రకటన విడుదల చేశారు. నూతన సంవత్సరాది సోమవారం రోజున తారువ, విశాఖపట్నాలలోని క్యాంప్ కార్యాలయాల్లో డిప్యూటీ సీఎం అందుబాటులో ఉండరని స్పష్టం చేశారు. శుభాకాంక్షలు తెలిపేందుకు ఎవరూ రావొద్దని విజ్ఞప్తి చేశారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



ఏపీటీఎఫ్ 2024 డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లి : విశాఖ మింది గ్రామంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ స్వగృహంలో శనివారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 2024 డైరీ, క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ ప్రగతికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి ఫెడరేషన్ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వపు కార్యదర్శి బి.వెంకటపతిరాజు, జిల్లా అధ్యక్షుడు కె.కె.ఎల్.ఎస్.ధర్మారావు, విశాఖ జిల్లా అధ్యక్షుడు కొటాన శ్రీనివాసు, కార్యదర్శి తమలాల రామకృష్ణ, సీనియస్ నాయకులు వై.శ్రీనివాసరావు, ఎస్.సన్యాసినాయుడు, ఎం.ఎస్.ప్రకాశరావు, డి.కొండలరావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీలకు నందిని



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన నందినితో హెచ్‌ఎం వరప్రసాద్, పీడీ గోవిందరావు, ఉపాధ్యాయులు

రోలుగుంట : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన మడ్డు నందిని జాతీయస్థాయి స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీలకు ఎంపికైనట్టు పీడీ గోవిందరావు శనివారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 15 న పాఠశాల మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన నందిని జాతీయస్థాయికి ఎంపికైనట్టు తెలిపారు. ఆమె జనవరి 4,5,6 తేదీల్లో రాజస్థాన్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా నందినితో పాటు శిక్షణ ఇచ్చిన పీడీ గోవింద్‌ను హెచ్‌ఎం వరప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామీణ క్రీడాకారులకు సువర్ణావకాశం

- క్రీడాకారులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం
- రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ సీఎండీ ధ్యాన్‌చంద్ర
- యలమంచిలిలో ఆడుదాం ఆంధ్రా పోటీల పరిశీలన



క్రీడాకారులతో మాట్లాడుతున్న రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ధ్యాన్‌చంద్ర

యలమంచిలి : గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించేందుకే ఆడుదాం ఆంధ్రా క్రీడలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిందని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హెచ్.ఎమ్ ధ్యాన్‌చంద్ర అన్నారు. శనివారం యలమంచిలి రాజీవ్ క్రీడా మైదానంలో జరుగుతున్న క్రికెట్, తైక్వాండో క్రీడలను ఆయన పరిశీలించారు. క్రీడాకారులకు అందుతున్న సదుపాయాలను మున్సిపల్ మేనేజరు ప్రభాకరరావు, సచివాలయ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులతో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ క్రీడల పట్ల వారి ఆసక్తిని అడిగి తెలుసుకున్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా క్రీడాకారులను గుర్తించలేదని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం అందించడంతో తమ ప్రతిభను నిరూపించుకోవడానికి మంచి అవకాశం దొరికిందని క్రీడాకారులు ఆయనకు తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను కనబరిచి తమ గ్రామానికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఆడుదాం ఆంధ్రా క్రీడలకు ప్రభుత్వం నిధులు అందజేయడం జరిగిందని, అధికారులు వాటిని వినియోగించి క్రీడలను నిష్పక్షపాతంగా ఎటువంటి అవకతవకలు చోటు చేసుకోకుండా నిర్వహించాలని సూచించారు.

కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి ఎల్.వి.రమణ, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వ్యాయామ ఉపాధ్యాయులు, వివిధ గ్రామ వార్డు సచివాలయలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

- డీఈవో వెంకటలక్ష్మమ్మ
- యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

అనకాపల్లి : వచ్చే ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని, రాష్ట్రంలో జిల్లాను ప్రథమ స్థానంలో ఉండేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. జీవీఎంసీ విలీనగ్రామైన కొప్పాకలో తమ కార్యాలయంలో శనివారం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 2024 డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు రోజువారి విధి విధానాలను డైరీలో నమోదు చేసుకోవడం ఎంతో ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏడీ ఆడారి రవిబాబు, మోనిటరింగ్ అధికారి వై.వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్‌లు రామలింగేశ్వరరావు, చైతన్య యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయ్, అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, కార్యదర్శి నడిగట్ల శేషుకుమార్ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో ఖాళీ దుకాణాల వేలం

- వ్యాపారుల నుంచి మంచి స్పందన



వేలంపాటలో పాల్గొన్న వ్యాపారులతో కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు

అనకాపల్లి : స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో గల 13, 18, 23, 33,34, 39 కమర్షియల్ దుకాణాలకు శుక్రవారం రాత్రి బహిరంగ బ్యాలెట్ వేలంపాట జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు హాజరయ్యారు. యార్డులో ఆరు దుకాణాలకు రెండేళ్ల కాలానికి వేలంపాట జరిగిందన్నారు. సుమారుగా 40 మంది పాటలో పాల్గొన్నట్టు తెలిపారు. గతంలో ఒక్కో దుకాణానికి నెలకు రూ.3 నుంచి 4వేలు వరకూ ఆదాయం వచ్చేదని, జిల్లా ఏర్పడిన తరువాత డిమాండ్ పెరిగిందని అన్నారు. నెలవారి దుకాణాలు అద్దె 13వ షాప్ రూ.9వేలు, 18వ షాప్ 14,800, 23వ షాప్ రూ.9,100, 33వ షాప్ రూ.10,200, 34వ షాప్ రూ.9,009, 39వ షాప్ రూ.8,600లకు వ్యాపారులు పాడుకున్నట్లు తెలిపారు. మార్కెట్ యార్డు కార్యదర్శి డి.శకుంతల, ఉపాధ్యక్షుడు సోమునాయుడు, సభ్యులు నీటిపల్లి లక్ష్మి, శోభ, శ్యామల, నూక రత్నం, తులసీకుమారి, జయ,దుర్గ, తెరపల్లి లక్ష్మి, దాడి కుమార్ వరహాలకృష్ణ, మోదిబాబు, కన్నబాబు, రమేష్ గుప్తా, శివ, సూపర్‌వైజర్ బంగారాజు పాల్గొన్నారు.

కన్నుమూసినా... చూపునివ్వాలని...

- అనారోగ్యంతో జైతవరం గ్రామస్తుడు అప్పారావు మృతి
- మృతుడి నేత్రదానానికి కుటుంబ సభ్యుల అంగీకారం



అప్పారావు (ఫైల్)

చీడికాడ : పుట్టెడు దుఃఖంలోనూ మానవత్వంతో ఆ కుటుంబ సభ్యులు స్పందించారు. నేత్రదానం చేసి స్ఫూర్తిగా నిలిచారు. అనారోగ్యంతో బాధపడుతున్న జైతవరం గ్రామానికి చెందిన కంటిపాము చిన అప్పారావు (62)ను కుటుంబ సభ్యులు శుక్రవారం విశాఖ కేజీహెచ్‌లో చేర్పించారు. బీపీ ఎక్కువ కావడం పాటు గుండెపోటు రావడంతో సాయంత్రం 4 గంటలకు చిన అప్పారావు మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు మృతుడు అప్పారావు నేత్రాలను దానం చేశారు. ఉప సర్పంచ్, మండల సచివాలయాల కనీ్వనర్ ఈర్లె చైతన్య సహకారంతో ఎల్.వి. ప్రసాదు కంటి ఆస్పత్రికి సంబంధించి మోసిన్ ఐ బ్యాంకు ద్వారా ఈ నేత్రదానం చేశారు. మా నాన్న చనిపోయినప్పటికీ ఆయన నేత్రదానం చేయడం వల్ల మరొకరికి చూపు ప్రసాదించవచ్చని భావించినట్టు మృతుడి కుమారుడు సంతోష్ తెలిపారు. ఆయా కుటుంబ సభ్యులను గ్రామ పెద్దలు, మంచాల మోడల్ స్కూలు కమిటీ చైర్మన్ కశిరెడ్డి రామకృష్ణ అభినందించారు. అప్పారావు అంత్యక్రియలు శుక్రవారం సాయంత్రం గ్రామంలో నిర్వహించారు.

ఇంద్రప్రస్థం నాటకానికి బంగారు నందిపై హర్షం

మునగపాక : ఈ నెల 17న స్థానిక నందీశ్వర తులసీ కళావేదికపై ప్రదర్శించిన ఇంద్రప్రస్థం నాటకం ఇటీవల విజయవాడలో రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రదర్శితమై బంగారు నందిని కైవసం చేసుకుంది. దీంతో స్థానిక కళాకారులు హర్షం వ్యక్తం చేశారు. గుంటూరుకు చెందిన అభినయ ఆర్ట్స్ కళాకారులతో ఈ నెల 17న మునగపాకలో నాటకరంగ దర్శకుడు మొతికా సాంబశివరావు వర్థంతి సందర్భంగా ఇంద్రప్రస్థం నాటకం ప్రదర్శన నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రేక్షకుల అదరాభిమానాలు అందుకున్న ఈ నాటకం విజయవాడలో నిర్వహించిన నంది నాటకోత్సవాల్లో బంగారు నందిని దక్కించుకుంది. దర్శకుడు ఎస్.రవీంద్రరెడ్డి, సంగీత దర్శకుడు పి.లీలామోహన్‌తో పాటు ఇతర కళాకారులు ఉత్తమ బహుమతులు అందుకున్నారు. ఈ మేరకు శనివారం గ్రామీణ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు సూరిశెట్టి రాము, స్థానిక కళాకారులు టెక్కలి కొండలరావు, కాండ్రేగుల జగ్గారావు, దాడి ముసిలినాయుడు, ఆత్మారామ్, పెంటకోట రాము, మళ్ల సంజీవరావు, కేఎం నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

'జగన్ సైన్యం..' పాట ఆవిష్కరణ



జగన్ సైన్యం పాటను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి

నర్సీపట్నం : అభివృద్ధి, సంక్షేమంపై ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ రూపొందించిన పాటను వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి శనివారం ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల కాలంలో నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ ఎమ్మెల్యే గణేష్ జగన్ సైన్యం..పాటను చిత్రీకరించారు. సామాజిక సాధికార యాత్రకు విచ్చేసిన వై.వి.సుబ్బారెడ్డి ఈ పాటను ఆవిష్కరించారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ఈ పాట ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లడం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, జిల్లా పార్టీ కార్యదర్శి బొడ్డు గోవిందరావు, డాక్టర్ లక్ష్మీకాంత్, చింతకాయల వరుణ్, ఏఎంసీ భాస్కర్‌నాయుడు, చెరుకూరి సత్యనారాయణ, లాలం అప్పారావు, సినీ నిర్మాత కర్రి రాంగోపాల్, పార్టీ మహిళా విభాగం ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత పాల్గొన్నారు.

చీడిపల్లి పంచాయతీ అభివృద్ధికి కృషి

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



చీడిపల్లిలో డ్రైనేజీలను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

చీడికాడ: చీడిపల్లి గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు హామీ ఇచ్చారు. చీడిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను ఆయన సర్పంచ్ కశిరెడ్డి సూర్యనారాయణ, గ్రామస్తులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సలహాలు, సూచనలు చేశారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. మరో రూ.10 లక్షలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం

▶9వ పేజీ తరువాయి

సైబర్ నేరాలు: ఈ ఏడాది 57 సైబర్ కేసులు నమోదయ్యాయి. నేరాల నియంత్రణకు మహిళా పోలీసులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

నేరము–శిక్ష: న్యాయస్థానాలు వివిధ కేసుల్లో ఆరుగురికి జీవితఖైదు, రెండు కేసుల్లో 20 ఏళ్ల జైలుశిక్ష విధించాయి. ఏడు కేసుల్లో 5 నుంచి 10 సంవత్సరాల మధ్య జైలుశిక్ష, 28 కేసుల్లో ఐదేళ్ల కంటే తక్కువ శిక్ష విధించారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమం

కారుణ్య నియామకాల్లో భాగంగా 8 మందికి జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్ట్ ఉద్యోగాలు ఇచ్చారు. 14 మందిని హోంగార్డులుగా నియమించారు. ప్రతి నెల మూడో శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహించి పోలీసుసిబ్బంది, హోంగార్డుల సమస్యల పరిష్కారానికి చర్య లు చేపడుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసుశాఖలో పనిచేస్తున్న అందరికీ వ్యక్తిగత పనులు చేసు కునేందుకు వీక్లీ ఆఫ్ ఇస్తున్నారు. ఎస్పీ నేర సమీక్ష కా ర్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, క్రైం ఎస్పీ ఎస్.సత్యానారాయణరావు పాల్గొన్నారు.

సజావుగా సార్వత్రిక ఎన్నికలు



వార్షిక సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

- వార్షిక నేర సమీక్ష సమావేశంలో కలెక్టర్ పిలుపు

అనకాపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికలు నిర్వహించే సమయంలో అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా పోలీస్ సిబ్బంది చర్యలు చేపట్టాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం రాత్రి రెవెన్యూ, ఆర్టీసీ, సెబ్, సీఐడీ శాఖలతో ఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన పోలీస్ వార్షిక నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఈ ఏడాది జరిగిన నేరాల గురించి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. జేసీ ఎం.జాహ్నవి, జిల్లా అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, క్రైం ఎస్పీ పి.సత్యనారాయణరావు, డీఎస్పీలు వీ.సుబ్బరాజు, కె.వి.సత్యనారాయణ, పి.శ్రీనివాసరావు, డీఎంఅండ్‌హెచ్‌వో ఎ.హేమంత్, సెబ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ మీరా సాహెబ్, సీఐడీ డీఎస్పీ లక్ష్మణరావు, ప్రజారవాణాశాఖ జిల్లా అధికారి కె.పద్మావతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయానికి హార్మోనియం వితరణ



ఆలయ కమిటీ సభ్యులకు హార్మోనియం అందజేస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లి : అన్ని దానాల కంటే అన్నదానం గొప్పదని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక గవరపాలెం సంతోషిమాత అమ్మవారి 47వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. తన సొంత నిధులతో అమ్మవారి ఆలయానికి హార్మోనియం అందజేసిన రత్నాకర్, అమృత దంపతులు మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీ సౌజన్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పీలా రాంబాబు, విల్లూరి ప్రసాద్, కాండ్రేగుల వెంకట సాంబశివరావు, పెతకంశెట్టి గోపి, కొణతాల గోవింద, మల్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేదిక ఉపాధ్యక్షునిగా 'కొమ్మోజు'

అనకాపల్లి : ఆర్టీఐ ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షునిగా స్థానిక వేల్పులవీధికి చెందిన కొమ్మోజు రమేష్‌ను నియమిస్తు హైకోర్టు న్యాయవాది, సంకల్ప వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మధురై రంగసాయిరెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఆర్టీఐ ద్వారా చాలా సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. వేదిక ఆధ్వర్యంలో జిల్లా సలహా మండలిని త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

సీతారాముల అక్షింతల ఊరేగింపు

కశింకోట : మండలంలోని తేగాడ గ్రామంలో అయోధ్య సీతారాముల అక్షింతలను శనివారం పెద్ద ఎత్తున ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటాలతో రామ నామ స్మరణ చేశారు. ఊరేగింపు అనంతరం అక్షింతలను రామాలయంలో భద్రపరిచారు. వీటిని జనవరి 1వ తేదీ నుంచి 15 రోజుల పాటు ఇంటింటికీ పంపిణీ చేయనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు నీటిపల్లి దివాకర్ తెలిపారు. సర్పంచ్ నీటిపల్లి ఈశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు తుంపాల మంగతాయారుతదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 5,348 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,510	4,810
మొదటి రకం	3,950	4,500
రెండో రకం	3,750	4,250
మూడోరకం	3,440	3,730

అనకాపల్లి సినిమాలు

బబుల్ గమ్ : రాజా
పిండం (మధ్యాహ్నం, రెండో ఆట)
వెంకీ (మార్నింగ్, సాయంత్రం ఆట) : సత్యనారాయణస్క్రీన్-1
ఆక్వామెన్(తెలుగు-3డీ): సత్యనారాయణస్క్రీన్-2
డెవిల్ : షిర్డిసాయి
సలార్ : పర్తిసాయి
మంగళవారం : వెంకటేశ్వర
తికమక తాండ : శ్రీసత్య
సలార్ : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 64 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ×ఎ౯ పాజిటివ్-9 యూనిట్లు, ×బి౯ పాజిటివ్-16 యూనిట్లు, ×ఒ౯ పాజిటివ్-33 యూనిట్లు, ×ఎబి౯ పాజిటివ్-6 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 393 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 352 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

ఇది కదా అభివృద్ధి

సీఎం జగన్ నేతృత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోంది. విద్య, వైద్యంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనలో జగనన్న ప్రభుత్వం ఏమాత్రం వెనక్కి తగ్గటం లేదు. అందుకు ఉదాహరణే బొజ్జన్నకొండకు వెళ్లే రహదారి ఆధునికీకరణ. ఒకప్పుడు శిథిలమై అడుగు తీసి అడుగేయటానికి కూడా వీలు కాని రీతిలో ఉండే ఈ రోడ్డును ప్రభుత్వం అద్దంలా తీర్చిదిద్దింది. దీంతో **పర్యాటకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు**



పూర్తయిన సీసీ రోడ్డు పనులు

బొజ్జన్నకొండకు.. రూట్ క్లియర్

- పూర్తయిన సీసీ రోడ్డు పనులు
- నాడు రాళ్లు, రప్పలతో దుర్భరం
- నేడు అద్దంలా తళతళలాడుతూ సౌకర్యవంతం



డబుల్ లేయర్లతో పటిష్టంగా పూర్తయిన రోడ్డు



నా పేరు తోట భువనరావు. మాది శంకరం గ్రామం. మాకు బొజ్జన్నకొండ వద్ద వ్యవసాయ భూములున్నాయి. మా గ్రామం నుంచి నిత్యం ఈ రోడ్డు మీదుగానే రాకపోకలు సాగిస్తాం. ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో మొన్నటి వరకు చాలా ఇబ్బంది పడేవారం. మోకాళ్ల లోతు నీటి గుంటలతో రోడ్డు చెరువును తలపించేది. ఎంపీ సత్యవతి ప్రత్యేక శ్రద్ధతో ఈ రోడ్డు రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. అడుగున్నర ఎత్తులో అత్యంత పటిష్టంగా డబుల్ లేయర్లతో ఈ రోడ్డు పూర్తి చేశారు. చాలా దృఢంగా ఉంది. సులభంగా రాకపోకలు చేయగలుగుతున్నాం.



నా పేరు బంటు నితీష్. కాపుశెట్టివానిపాలెం గ్రామం నుంచి బొజ్జన్నకొండకు వచ్చాను. ప్రతి ఏటా కార్తీకమాసంలో మా స్నేహితులతో కలిసి ఇక్కడ పిక్నిక్ చేసుకుంటాం. ఈ రోడ్డు రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. జాతీయ రహదారి నుంచి బొజ్జన్నకొండ వరకు రోడ్డు చాలా బాగుంది. క్షణాల్లో కొండ వద్దకు చేరుకోగలుగుతున్నాం. గత ఏడాది వరకు ఈ రోడ్డు అత్యంత దారుణంగా ఉండేది. ఇంకెప్పుడూ కొండకు రాకూడదని అప్పుడు అనుకున్నాం. గత ఏడాది బురదలో బండి జారిపడి చిన్నచిన్న గాయాలు కూడా అయ్యాయి. అలాంటి రోడ్డు ఇప్పుడు చాలా బాగా నిర్మించారు. జాతీయ రహదారి కూడా అభివృద్ధి చెందడంతో పోల్చుకోలేకపోతున్నాం. కొండ వద్ద కూడా మౌలిక సౌకర్యాల కల్పనకు పనులు జరుగుతున్నాయి. ఏలేరు కాలువకు ఆనుకుని నిర్మించిన ఈ రోడ్డు పరిసరాలు చక్కటి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

తుమ్మపాల : కొన్నేళ్లుగా శిథిలావస్థలో ఉన్న బొజ్జన్నకొండ రోడ్డుకు మోక్షం లభించింది. జిల్లాలో పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంటున్న ప్రాచీన బౌద్ధారామం బొజ్జన్నకొండ. నూతన జిల్లా ఏర్పాటుతో అనకాపల్లికి కేరాఫ్ అడ్రస్‌గా బొజ్జన్నకొండను అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కార్తీక మాసంలో ఇక్కడికి పర్యాటకులు పోటెత్తుతారు. ప్రతి ఏటా కనుమ రోజున బౌద్ధభిక్షువులతో మహా బౌద్ధమేళా నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత. ఇంతటి ప్రాచుర్యం కలిగిన ఈ ప్రాంతానికి చేరుకోవాలంటే సరైన రహదారి లేక సందర్శకులు అనేక తిప్పలు పడేవారు. ఇకపై అటువంటి సమస్య లేకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది.

పూర్తయిన రోడ్డు పనులు..

కేవలం పది రోజుల వ్యవధిలోనే తుది దశ సీసీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. శంకరం ఏలేరు కాలువ జంక్షన్ నుంచి బొజ్జన్నకొండ వరకు తుమ్మపాల రోడ్డును కలుపుతూ వెయ్యి 50 మీటర్ల పొడవు గల రోడ్డు నిర్మాణం పూర్తయింది. అనకాపల్లి-ఆనందపురం రహదారిని ఆనుకుని ఏలేరు కాలువ గుండా అభివృద్ధి చేస్తున్న సీసీ రోడ్డు అతి త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానుంది.

జాతీయ రహదారికి అనుసంధానంగా..

ఇటీవల ఆరు లైన్ల రోడ్డుగా అభివృద్ధి చేసిన అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారికి శంకరం జంక్షన్ వద్ద అనుసంధానం చేస్తు అత్యంత పటిష్టంగా ఈ రోడ్డును నిర్మించారు. ఎంపీ బీవీ సత్యవతి ప్రత్యేక చొరవతో రూ.7 కోట్ల మేర కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో జాతీయ రహదారిని ఈ రోడ్డుతో అనుసంధానం చేసి శిలా తోరణ నిర్మాణానికి డిజైన్ సిద్ధం చేశారు. పర్యాటకులకు స్వాగతం పలుకుతూ నిర్మించనున్న శిలా తోరణం ఏర్పాటైతే బొజ్జన్నకొండ రూపురేఖలు మారిపోతాయి.

రూ.1.5 కోట్ల ఎంపీ నిధులతో..

వెయ్యి 50 మీటర్ల పొడవు గల ఈ రోడ్డు నిర్మాణానికి రూ.1.5 కోట్ల మేర ఖర్చు కానున్నట్లు అధికారులు లెక్కలు వేశారు. దీంతో ఎంపీ సత్యవతి రూ.40 లక్షల వరకు నిధులు మంజూరు చేశారు. పటిష్టమైన రోడ్డు నిర్మాణానికి గాను మరో రూ.98 లక్షలు మంజూరు చేసి రెండు దఫాలుగా సీసీ రోడ్డును డబుల్ లేయర్‌తో నిర్మించారు. ఈ రోడ్డుకు ఆనుకుని ఏలేరు కాలువ ద్వారా స్టీల్‌ప్లాంట్‌కు నీటి సరఫరా జరుగుతోంది. దీంతో రోడ్డును పటిష్టంగా నిర్మించాలని కలెక్టర్ ఆదేశించడంతో డబుల్ లేయర్ రోడ్డుకు ఎంపీ నిధులు సమకూర్చారు. ఈ రోడ్డు 40 సంవత్సరాల పాటు చెక్కు చెదరకుండా ఉంటుందని అధికారులు తెలిపారు.

బొజ్జన్నకొండకు వెళ్లే రోడ్డు నిర్మాణానికి చేసిన వ్యయం

- రోడ్డు నిర్మాణ అంచనా వ్యయం రూ. 1.5 కోట్లు
- మొదటి దశలో విడుదలైన ఎంపీ నిధులు రూ. 40 లక్షలు
- మల్లి విడత మరో 98 లక్షలు విడుదల
- డబుల్ లేయర్లతో పటిష్టంగా నిర్మాణం
- మొత్తం రోడ్డు పొడవు వెయ్యి 50 మీటర్లు
- ఏలేరు కాలువకు ఆనుకుని నిర్మించటంతో ఆహ్లాదాన్ని పంచుతున్న పరిసరాలు

ఉత్సాహంగా.. ఆడుదాం ఆంధ్రా

- పెద్ద ఎత్తున క్రీడల్లో పాల్గొంటున్న యువత



తుమ్మపాలలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు



తుమ్మపాలలో బ్యాడ్మింటన్ క్రీడలో పాల్గొన్న దిలీప్‌కుమార్



సిటీ పబ్లిక్ స్కూల్లో ఖోఖో ఆడుతున్న యువతులు



సీహెచ్‌ఎన్ అగ్రహారంలో కబడ్డీ ఆడుతున్న మహిళలు



తాళ్లపాలెంలో మహిళల కబడ్డీ పోటీ

అనకాపల్లి : గ్రామీణస్థాయి నుంచి క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు ఆడుదాం- ఆంధ్రా కార్యక్రమం అయిదురోజులుగా దిగ్విజయంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో పట్టణంలో 8 ప్రాంతాలతో పాటు మండలంలో ఏడు ప్రాంతాల్లో క్రీడలు జరిగాయి. తుమ్మపాల క్రీడా మైదానంలో వాలీబాల్ పోటీలను ఎంపీపీ గొర్లి సూరిబాబు ప్రారంభించగా బ్యాడ్మింటన్ పోటీలను ఏపీడబ్ల్యు చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ ప్రారంభించారు. పట్టణంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఆయా క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో తుమ్మపాల సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు, ఎంపీటీసీ పంచకర్ల కన్నారావు, వైస్ సర్పంచ్ చిన్ని, హైస్కూల్ కమిటీ చైర్మన్ గొంతిన శ్రీనివాసరావు, ఎంపీడీవో కె.నర్సింహారావు, ఈవోఆర్డీ ధర్మారావు, ఏసీడీపీవో పి.శశికళ, సచివాలయాల ఉద్యోగులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

తాళ్లపాలెం.. బయ్యవరంలో..

కశింకోట : తాళ్లపాలెం హైస్కూల్లో మహిళలు, పురుషులకు వేర్వేరుగా వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. పీడీ గోవిందరావు, పంచాయతీ కార్యదర్శి సత్యారావు పోటీలను పర్యవేక్షించారు. అలాగే బయ్యవరంలో మహిళలు, పురుషులకు వేర్వేరుగా షటిల్ బాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. మూడు జట్లు ల్గొన్నాయి. పీడీ కృష్ణ పోటీలను పర్యవేక్షించారు. తీడ ప్రాథమిక పాఠశాలలో మహిళా, పురుష జట్లకు కబడ్డీ పోటీలు నిర్వహించారు.



తాళ్లపాలెంలో పురుషుల కబడ్డీ పోటీ



బయ్యవరంలో పురుషుల షటిల్ బాడ్మింటన్ పోటీ



తాళ్లపాలెంలో పురుషుల వాలీబాల్ పోటీ

వేతనాల పెంపు కోరుతూ ధర్నా

కశింకోట : పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ధర్నా నిర్వహించారు. తమ వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శి రమేష్‌కు అందజేశారు. సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి. వరలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సంక్షేమ సంఘం మండల ప్రతినిధులు తనూజ, కమల కుమారి, చిన్ని శ్యామల, జయ తదితరులు పాల్గొన్నారు.

దశల వారీగా రహదారులు, డ్రైనేజీల అభివృద్ధి



అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో దిలీప్‌కుమార్, నాయకులు

అనకాపల్లి : దశల వారీగా గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీలను అభివృద్ధి చేయనున్నట్లు ఏపీఐడబ్ల్యు చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. మండలంలో తుమ్మపాల పంచాయతీ పరిధిలో కొత్తపేట వీధి, కంచరపేట వీధి డ్రైనేజీ, సెంటర్ లైటింగ్ పనులను శనివారం ఆయన ప్రారంభించారు. సుమారు రూ. 6 లక్షలతో ఈ పనులు చేపట్టామన్నారు. నెలరోజుల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, అన్నపూర్ణ బ్యాంక్ చైర్మన్ పీడీ గాంధీ, ఉపాధ్యక్షుడు సదరం చిన్న, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జగన్మోహిని అవతారంలో వేంకటేశ్వరస్వామి



అనకాపల్లి : స్థానిక గాంధీనగరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస వేడుకల్లో భాగంగా స్వామివారు శనివారం భక్తులకు జగన్మోహిని అవతారంలో దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి గోపలాచార్యులు (చక్రవర్తి) మాట్లాడుతూ జగన్మోహిని అవతారంలో స్వామి దర్శనం లభించడం ఈ ఆలయంలోనే జరిగిందన్నారు. ఎక్కడైనా ఉత్సవమూర్తులను మాత్రమే అలంకరిస్తారని ఆయన తెలిపారు. స్వామివారి అవతారం జనవరి 1వ తేదీ వరకూ ఉంటుందన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల పండగ



రత్నాకర్‌ను సత్కరిస్తున్న ఆళ్ల రామచంద్రరావు

అనకాపల్లి : స్థానిక విజయరామరాజుపేట శ్రీ గౌరీపరమేశ్వరుల పండగ మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. మహోత్సవాని పురస్కరించుకుని మూడు స్టేజ్ ప్రోగ్రాంలు, నాలుగు నేలవేషాలు ఆలయ కమిటీ చైర్మన ఆళ్ల రామచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అంతకు ముందు వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ గౌరీపరమేశ్వరులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు ఆయనను సత్కరించారు.

భిన్న అవతారాల్లో వేంకటేశ్వరస్వామి



పరశురాముని అవతారంలో..



మోహిని అవతారంలో

కశింకోట : స్థానిక గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామిని పరశురాముని అవతారంలో అందంగా అలంకరించారు. ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామిని మోహిని అవతారంలో అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. పాశుర విన్నపం, తిరుప్పావై పారాయణ చేశారు. గవరపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు సుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ చైర్మన్ భీశెట్టి దుర్గానాగేశ్వరరావు ఆధ్వర్యంలోను, ధ్యాన వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు రేజేటి రామచరణాచార్యుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు



ఏఎస్ పేటలో మేలుకొలుపు నిర్వహిస్తున్న భక్తులు

కశింకోట : మండలంలోని చింతలపాలెం, ఏఎస్ పేట గ్రామాల్లో శనివారం మేలుకొలుపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని చింతలపాలెంలో హరిదాసు సహా మహిళా భక్తులు హరి నామ స్మరణతో శ్రీకృష్ణుని పటాలు, సీతారాముల పటం ఊరేగిస్తూ భజనలు చేశారు.

తోడపెద్దుకు అచ్చుపోత కార్యక్రమం

కశింకోట : మండలంలోని వెదురుపర్తి గ్రామంలో తోడపెద్దుకు అచ్చుపోత కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తోడపెద్దుకు సేవలు జరిపారు. మహిళలు కోలాటాలు ప్రదర్శించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, భక్తులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీమెటీరియల్‌ను అందజేస్తున్న నారాయణరావు, బాబూరావు

- మూడు హైస్కూళ్ల విద్యార్థులకు అందజేత

కె.కోటపాడు : పదవ తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలని గొండుపాలెం హైస్కూల్ ఉపాధ్యాయుడు ఎల్.వి.నారాయణరావు అన్నారు. సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గొండుపాలెం హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులకు శనివారం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని ప్రతి విద్యార్థి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. గొండుపాలెం హైస్కూల్ విద్యార్థులతో పాటు ఎ.కోడూరు, మేడిచర్ల హైస్కూళ్లకు చెందిన విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సూర్రెడ్డి బాబూరావు, గొండుపాలెం సర్పంచ్ బండారు కనక మల్లీశ్వరి, ఎంపీటీసీ వంటాకు నారాయణమ్మ పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షింతల పంపిణీకి ఏర్పాట్లు

మాడుగుల రూరల్: అయోధ్య నుంచి వచ్చిన స్వామి వారి అక్షింతలను కె.జె.పురం గ్రామంలో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కె.జె.పురం మోదకొండమ్మ ఆలయంలో ఈ అక్షితలను చిన్న చిన్న ప్యాకెట్లలో శనివారం సిద్ధం చేశారు. వచ్చేనెల 3వ తేదీన వీటిని ఇంటింటికీ పంపిణీ చేయనున్నట్టు విశ్వహిందూ పరిషత్ మండల ప్రముఖ్ రాపేట రామ కొండలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యవాహ ఆడారి శ్రీనివాసరావు మాస్టర్, స్థానిక ఎంపీటీసీ సభ్యులు భీశెట్టి శ్రీనివాసరావు, ఆడారి కన్నారావు తదితర్లు పాల్గొన్నారు. అలాగే రోలుగుంటలో కూడా వచ్చే నెల 1 నుంచి 3వ తేదీ వరకూ అన్ని గ్రామాల్లో ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేస్తారు.

పూర్వ విద్యార్థుల వన సమారాధనకు ఆహ్వానం

అనకాపల్లి : జీవీఎంసీ గవరపాలెం చిన్నహైస్కూల్‌కు చెందిన 1972-75 బ్యాచ్ పూర్వ విద్యార్థుల వన సమారాధన ఆదివారం ఉదయం 9 నుంచి 5 వరకూ జరుగుతుందని సంక్షేమ సంఘం అధ్యక్షుడు బల్లా నాగభూషణం, కార్యదర్శి దాడి శివరామకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొప్పాక గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్ ఎదురుగా ఉన్న జెమిని డ్రింక్స్ ఆవరణలో జరిగే ఈ కార్యక్రమానికి పైన పేర్కొన్న సంవత్సరాల్లో చదివిన పూర్వ విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

అనకాపల్లి ఏరియా ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ వనభోజన కార్యక్రమం ఆదివారం మండలంలో సత్యనారాయణపురం మామిడితోటలో ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కనిశెట్ల కోటేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ సభ్యులు కుటుంబ సమేతంగా హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఓటరు నమోదుపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

మాకవరపాలెం: మండలంలోని తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ఓటరు నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఈ సదస్సులో నర్సీపట్నం ఆర్డీవో జయరాం మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారంతా ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అర్హత ఉన్న వారంతా ఓటు హక్కును నమోదు చేసుకుని, ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఓటును వినియోగించుకోవాలని తెలిపారు. తహసీల్దార్ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ మోహనరావు తదితరులు మాట్లాడారు.

అశ్వ వాహనంపై వెంకన్న

నక్కపల్లి : ధనుర్మాస అధ్యయనోత్సవాల్లో భాగంగా ఉపమాకలో వేంకటేశ్వర స్వామివారి తిరువీధి సేవలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శనివారం స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, అర్చనలు, నిత్యకార్యక్రమాలు నిర్వహించారు. కొండదిగువన క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామికి, గోదాదేవి అమ్మవారికి, స్వామివారి ఉత్సవ మూర్తులకు, ఇతర ఉపాలయాల్లో అర్చక బృందం నిత్యార్చనలు పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారిని ఆంజనేయ వాహనంపై, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో ఉంచి తిరువీధి సేవ నిర్వహించారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో తిరుప్పావైలోని ఎల్లే ఇళఃకిళియే ఇన్నం ఉరంగదియో 15వ పాశురాన్ని ప్రత్యేక నీరాజనాలతో సమర్పించారు. రాపత్తు అధ్యయనోత్సవాల్లో భాగంగా సాయంత్రం పుణ్యకోటి వాహనంపై స్వామివారి తిరువీధి సేవ జరిగింది. అనంతరం నాలాయిర దివ్య ప్రబంధ సేవాకాలం, విశేష ప్రసాద నివేదనలు తీర్థ గోష్ఠి ప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమాల్లో ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చక స్వాములు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి వెంకట శేషాచార్యులు, భాగవతం గోపాలాచార్యులు, శ్రీనివాసాచార్యులు, రాజగోపాలాచార్యులు పాల్గొన్నారు.